క్లుప్తంగా

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

పాలసముద్రం: విద్యార్థులు విద్యతోపాటు క్రమశిక్షణ కూడా అలవరచుకోవాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం అరుణోదయ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో హెచ్ఎం సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సరస్వతి పూజలు చేసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విచ్చేసిన ఎంఈఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణత శాతమే విద్యార్థులకు తొలిమెట్టు అని తెలిపారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను ఒకటికి రెండు సార్లు చదివి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు.

వధూవరులకు ఆశీస్సులు

పుత్తూరు: కార్తీక్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం జరిగిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు మార్బల్ గోపి అన్న కుమార్తె వివాహ రిసెప్షన్‌లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట పలువురు వైఎస్ఆర్ సీపీ నాయకులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు మందలింపు



అగరంలో టీక్యూఆర్ఎల్ పరిశీలిస్తున్న ఎంఈఓ

నగరి: టీక్యూఆర్ఎల్ (టీచింగ్ అట్ రైట్ లెవల్) పూర్తిచేయని ఉపాధ్యాయులను ఎంఈఓ శ్రీదేవి మందలించారు. శనివారం మండలంలోని అగరం, మీరాసాహెబ్‌పాళెం గ్రామాల్లోని పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. మీరాసాహెబ్ పాళెంలో 1, 2వ తరగతులకు గణితం సిలబస్ పూర్తి చేయకపోవడం, 4, 5వ తరగతులకు ఆంగ్లబోధన సక్రమంగా చేయకపోవడంపై ఉపాధ్యాయులను మందలించారు. అగరం పాఠశాలలో టీక్యూఆర్ఎల్ సక్రమంగా ఉండడంతో ఉపాధ్యాయులను ప్రశంసించారు.

అనారోగ్యంతో ఆశా కార్యకర్త మృతి



అముద (ఫైల్)

పాలసముద్రం: వెంగళరాజుకుప్పం గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త అముద అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. అముద(45) వారం రోజుల క్రితం ఆరోగ్యం సరిలేక పోవడంతో తిరుపతి పద్మావతి ఆస్పత్రిలో చికిత్స పొందింది. ఆరోగ్య పరిస్థితి నిలకడ లేదని వైద్యులు చెప్పడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లేలోగానే ఆమె మృతి చెందారు. ఆమె మృతదేహానికి వైద్య సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జిల్లా అభివృద్ధికి నిధులు ఇవ్వండి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా అభివృద్ధికి సీఎం నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఆధీనంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, నిరుద్యోగులను ఆదుకోవడానికి పరిశ్రమలను పెట్టాలన్నారు. ఎక్స్‌ప్రెస్ హైవే, బుల్లెట్ ట్రైన్ల రాకతో భూములు నష్టపోతున్న రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని చెప్పారు. పవర్‌లూమ్ కార్మికులకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. ఆశ, వీవోఏ, మధ్యాహ్న భోజనం ఇతర స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తాగునీటి సమస్య పలు ప్రాంతాల్లో కనిపిస్తోందని చెప్పారు. వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని, పంటకు గిట్టుబాటు ధరలను కల్పించాలని వివరించారు.

రేషన్ సరుకులకు ఇబ్బందులు

పూతలపట్టు(కాణిపాకం): రేషన్ సరుకులు తీసుకోవడానికి తాము ఇబ్బంది పడుతున్నామని, పూతలపట్టు మండల కేంద్రంలో రేషన్ తీసుకునేలా చూడాలని రంగంపేట క్రాస్ గువ్వలకాలనీ వాసులు కోరారు. ఈ మేరకు పూతలపట్టు తహసీల్దార్ గుర్రప్పను శనివారం కలిసి విన్నవించారు. గువ్వలకాలనీలో 41 కుటుంబాలున్నాయని, వీరంతా సామనత్తంకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. ఆటోలో వెళ్లి రేషన్ తెచ్చుకోవాలని, రేషన్ మండల కేంద్రంలోనే తీసుకునేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

విద్యార్థుల గణిత ప్రజ్ఞాధారణ

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమంలో ప్రతిభ చాటారు. పాఠశాల ఆవరణలో శనివారం గణిత ప్రజ్ఞాధారణ నిర్వహించారు. పాఠశాలకు చెందిన లహరి, పునీత్‌సాయి కళ్లకు గంతలు కట్టుకుని పై విలువను రెండు వేల దశాంశ స్థానాలను చెప్పి అలరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గుండ్లకట్టమంచి ఉన్నత పాఠశాల హెచ్ఎం బేరినాథ్ మాట్లాడుతూ ఇద్దరు విద్యార్థులు 2 వేల దశాంశ స్థానాలు చెప్పడం గొప్ప విషయమన్నారు. మంగళపల్లె ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులను, మెంటర్‌గా వ్యవహరించిన అరుణశివప్రసాద్‌ను అభినందించారు. ఇన్‌చార్జి హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు సంజీవి, పిళ్లారప్ప, భారతి, సంపంగి, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



సర్వే మాయ!

సూపర్ సిక్స్ పథకాలను గత ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు తన ప్రచార సభల్లో తరచూ చెప్పేవారు. వీటిని అమలు చేస్తే తమ జీవితాలు మెరుగుపడుతాయనే ఆశతో ఆ పార్టీకి ప్రజలు పట్టం కట్టారు. తీరా అధికారంలోకి వచ్చి ఎనిమిది న్నర నెలలవుతున్నా వీటి అమలును కూటమి ప్రభుత్వం విస్మరించింది. తాజాగా పీ–4 సర్వే పేరిట ఉన్న సంక్షేమ పథకాలను కొల్లగొట్టేందుకు శ్రీకారం చుట్టింది.

– కార్వేటినగరం

- పేదల నెత్తిన పీ–4 పిడుగు
- 27 రకాల ప్రశ్నలతో సర్వే
- ఇంటిలోని విలువైన వస్తువుల వివరాల నమోదు
- చడీచప్పుడు లేకుండా సాగుతున్న సర్వే
- సంక్షేమ పథకాల లబ్ధిదారులకు కోత కోసమేనా?
- ఉలిక్కిపడుతున్న పేద వర్గాలు

ఫోన్.. టీవీ.. ఏసీ ఇతర గృహోపకరణాలు.. బైక్‌లున్నాయా.. ఇళ్ల స్వరూపం.. రేకులా, స్లాబా.. బ్యాంకు అకౌంట్ ఇలా 27 రకాల ప్రశ్నల్ని సంధించి సమాధానాలను సిబ్బంది నిపాల్సిన పరిస్థితి. ఆపై ప్రజల ఫోన్‌కు వచ్చిన ఓటీపీని నమోదు చేసి ప్రక్రియను ముగిస్తున్నారు. జిల్లాలో 5.40 లక్షల రేషన్ కార్డులున్నాయి. వీటి కోసం మరో 70 వేల కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. వీరంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలే. అప్పోసప్పో చేసి, నెలవారీ వాయిదాలో లేక ఎవరైనా కానుకగా ఇస్తే వారి ఇళ్లలో ఏసీలను ఎక్కువ మంది ఏర్పాటు చేసుకుంటారు. అయితే ఇది ఉందని తెలిస్తే చాలు వెంటనే సదరు వివరాలను ప్రభుత్వ రికార్డుల్లోకి సిబ్బంది నమోదు చేస్తున్నారు. ఈ వ్యవహారంతో తమకు సంక్షేమ పథకాలు ఆగిపోతాయనే ఆందోళన పేదల్లో నెలకొంది.

నిరాకరించినా..నమోదే

సర్వేలో సిబ్బంది పొందుపర్చే అంశాలు ప్రస్తుత జీవనశైలిలో భాగమైనవే. స్మార్ట్‌ఫోన్లు, బైక్‌లు ఇలాంటి ప్రశ్నలే ఉండడంతో సంక్షేమ పథకాల్లో కోత పడుతుందనే ఆందోళన ప్రజల్లో నెలకొంది. సర్వేకు ఎవరైనా నిరాకరిస్తే వారి పేర్లను సైతం నమోదు చేయాలనే ఆదేశాలు సిబ్బందికి జారీ చేయడం కలవరానికి గురిచేస్తోంది.

బాబూ నమ్మండయ్యా..?

పబ్లిక్, ప్రైవేటు పార్టనర్ షిప్‌తో నిర్వహించేదే పీ–4 సర్వే దీన్ని విశ్వసించాలని పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, మండలాల్లో ఎంపీడీఓలు ప్రజలను అభ్యర్థిస్తున్నారు. జిల్లాలోని 612 సచివాలయాల పరిధిలో ఉన్న కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది. ఇంటి వద్దకు సిబ్బంది వెళ్లి వివిధ సమాచారాన్ని సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, దీన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని చెబుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను గుర్తించేందుకు ఇది దోహదపడుతుందనే అంశాన్ని ప్రజలకు తెలియజేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు యథావిధిగా కొనసాగుతాయని, ఇందులో ఎలాంటి అపోహలొద్దని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అంతా అయోమయం నెలకొంది.

సర్వే పూర్తయ్యాక..

సర్వే నివేదిక ప్రాతిపదికన ఆర్థికాభివృద్ధి, పేదరిక నిర్మూలన కోసం పీ–4ను ఉగాది పర్వదినాన ప్రారంభించనున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అట్టడుగున ఉన్న 20 శాతం మంది కోసం అగ్రశ్రేణిలో ఉన్న పది శాతం మంది వారు ఉన్నత స్థాయి పారిశ్రామిక వేత్తలు, ఆయా ప్రాంతాలకు చెందిన ఎన్ఆర్ఐల సహకారంతో పీ–4 విధానం ద్వారా పేద కుటుంబాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

నగరి: స్టోన్‌క్రషర్, క్వారీ యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో స్టోన్‌క్రషర్, క్వారీ యజమానులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి స్టోన్ క్రషర్, క్వారీ యజమాని మైనింగ్ లీజు ఆర్డర్లు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన గని లైసెన్సు, జీఎస్టీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ సక్రమంగా ఉంచుకోవాలన్నారు. బ్లాస్టింగ్‌కు ఇచ్చిన మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. దుమ్ముధూళి జనావాసాలకు వెళ్లకుండా కవర్లు వేసి క్రషింగ్ చేయాలని ఆదేశించారు. కంకర తరలించే సమయంలో పూర్తిస్థాయిలో కప్పివున్న వాహనంలోనే పంపాలన్నారు. రోడ్డుపై కంకర రాలుతూ వెళ్లే వాహనాల్లో పంపరాదన్నారు. అదే విధంగా క్రషింగ్, క్వారీ యూనిట్లలో పనిచేసే కార్మికులు గాయాల పాలుకాకుండా, ప్రాణాపాయం జరగకుండా రక్షణ విషయంలో తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తనిఖీ నిర్వహించే సమయంలో అనుమతులు లేకుంటే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాధితులకు మాజీ మంత్రి పరామర్శ

నింద్ర: మండలంలో పలు బాధిత కుటుంబాలను మాజీ మంత్రి ఆర్కే రోజా శనివారం పరామర్శించి, ధైర్యం చెప్పారు. చవరంబాకం మాజీ సర్పంచ్ సత్యరాజ్ సోదరి గౌరి కుమార్తె అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం మాజీ మంత్రి ఆర్కే రోజా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కోఆప్షన్ సభ్యుడు అనిల్‌కుమార్ మామ మారిముత్తు మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను కూడా మాజీ మంత్రి పరామర్శించారు.

ఎలకాటూరు వైఎస్ఆర్ సీపీ నాయకుడు నామదేవరెడ్డి భార్యకు అనారోగ్యంతో చికిత్స చేయించుకుని తిరిగి వచ్చారు. ఆమెతో మాట్లాడి ధైర్యం చెప్పారు. చవరంబాకం దళితవాడ నాయకుడు ధనపాల్ మృతి చెందారు. ఆయన మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అత్తూరు గ్రామంలో వైఎస్ఆర్ సీపీ నాయకుడు దామురెడ్డి మామ వారం రోజుల క్రితం మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని కూడా మాజీ మంత్రి పరామర్శించారు. ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభా, వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, జెడ్పీటీసీ పరంధామ, ఎంపీటీసీ సభ్యుడు విజేష్, సర్పంచ్‌లు బాబురెడ్డి, చంద్రబాబు, నాయకులు గుణ, బసవయ్య, రవిరెడ్డి, గోవిందమ్మ, రామచంద్రారెడ్డి, ఎయుమలై ఆచారి, రమేష్, కృష్ణమూర్తి, మునిరాజ్, మల్లికార్జుననాయుడు, రాము, చార్లీ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

మీర్‌జాన్‌బాషాకుఘన నివాళి

పుత్తూరు: వైఎస్ఆర్ సీపీ మైనారిటీ నాయకుడు జాఫర్ బాషా తండ్రి మీర్జాన్ బాషా శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకొన్న మాజీ మంత్రి, వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా వారి ఇంటికెళ్లి మీర్జాన్ బాషా భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్ఆర్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి భరోసా

నగరి: పెద్ద దిక్కును పోగొట్టుకున్న పార్టీ నేతల కుటుంబాలను, అనారోగ్యం, ప్రమాదాల బారిన పడిన కార్యకర్తలను మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. శనివారం ఉదయం మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడకు వెళ్లిన ఆమె ఇటీవల మృతి చెందిన వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు ఎస్ఎస్ భూపతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాను అండగా ఉంటానంటూ మృతుని కుమారులు ధనపాల్, జయచంద్ర, గణపతిలను ఓదార్చారు. అనంతరం కీళపట్టు దళితవాడలో అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న పార్టీనేత రవిని ఆమె పరామర్శించారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల్లో ధైర్యం నింపారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, పార్టీ మున్సిపల్ కన్వీనర్ రమేష్ రెడ్డి, కౌన్సిలర్లు బాబు, అణ్ణెమ్మ, ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రియాశీలక కార్యదర్శి మురుగయ్య, నాయకులు జగదీష్, మునివేలు, తనికాచలం, దేశప్పన్, పాండియన్, మధు, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.





బాధితులకు ధైర్యం చెబుతున్న మాజీ మంత్రి ఆర్కే రోజా, భూపతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్కేరోజా

బాలికల భవితకు పునాది వేయాలి



వడమాలపేట మండలంలో సైకిల్ ర్యాలీ

వడమాలపేట(విజయపురం): కిశోర వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని వడమాలపేట ఎంఈఓ పద్మావతి అన్నారు. మండల కేంద్రం ఉన్నత పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రోజారమణి ఆధ్వర్యంలో కిశోర వికాసం–2 (భేటీ పడావో... భేటీ బచావో) అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఎంఈఓ మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల బాలికలు చదువుపై దృష్టి పెట్టేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. 18 ఏళ్లలోపు వివాహాలు చేస్తే పోలీస్ స్టేషన్, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. బాలికల్లో ఆత్మరక్షణ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం, డిజిటల్ భద్రత, సైబర్‌క్రైమ్‌లపై జాగ్రత్తగా ఉండేలా అవగాహన కల్పించనున్నట్టు సూపర్‌వైజర్ రోజారమణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2తులసిరామ్, హెచ్ఎం కరుణ నవనీతమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో బంగారు భవిత



వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థులు

కార్వేటినగరం: క్రమశిక్షణతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని సర్పంచ్ దివ్య అన్నారు. శనివారం పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆర్కేవీబీ పేట ఉన్నత పాఠశాల క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి ఎందరో జీవితాలకు బంగారు భవిష్యత్తు అందించిందని గుర్తు చేశారు. అలాంటి పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు ఉన్నత స్థాయిలో నిలిచారన్నారు. అనంతరం 2023–24 విద్యా సంవత్సరం పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించి మొదటి, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన సత్య, చైతన్య, జయచంద్ర విద్యార్థులకు నగదు బహుమతులను అందించారు. అలాగే జై భీమ్ సేవా సంస్థ ద్వారా విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందించారు. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముమ్మరంగా చేతి పంపుల మరమ్మతులు



చేతి పంపులకు మరమ్మతులు

పాలసముద్రం: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలో ముమ్మరంగా చేతిపంపులకు మరమ్మతులు చేస్తున్నామని శుక్రవారం ఎంపీడీఓ క్రిష్ణమహేష్‌రెడ్డి తెలిపారు. గ్రామాల్లో చేతి పంపులు పనిచేయకపోవడంతో తాగునీటి సంగతి దేవుడెరుగు కనీస అవసరాలకు కూడా నీళ్లివ్వండి మహాప్రభో అంటూ ప్రజలు వేడుకుంటున్నారని సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తకు ఎంపీడీఓ క్రిష్ణమహేష్‌రెడ్డి స్పందించారు. వేసవిలో తాగునీటి సమస్యలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లోని చేతి పంపులకు మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. ఎండల తీవ్రతతో తాగునీటి సమస్యలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో సంబంధిత సర్పంచుల ఆధ్వర్యంలో ట్యాంకర్లతో తాగునీటి సరఫరా చేస్తామని తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



పరీక్షా కేంద్రం నుంచి వెలుపలకు వస్తున్న విద్యార్థులు

నగరి: జూనియర్ ఇంటర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. మున్సిపల్ పరిధిలోని ఇంటర్ విద్యార్థులకు 4 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయాన్నే పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు చేరుకున్నారు. తొలిపరీక్ష కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కేంద్రాల వద్ద బారులు తీరారు. పిల్లలను పరీక్షా కేంద్రానికి పంపి వెనుదిరిగారు. అన్ని కేంద్రాల్లోనూ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. నాలుగు సెంటర్లలో 1179 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

వైభవంగా పంచభూత మహాయాగం



యాగ సామగ్రితో ఊరేగింపు



యాగపూజలు

నగరి: మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం శ్రీకోదండరామ స్వామి ఆలయంలో సంక్రాంతి రోజున ప్రారంభమైన పంచభూత మహాపూజలు 48 రోజులపాటు నిర్వహించారు. శనివారం వైభవంగా జరిగిన పంచభూత మహా యాగశాల పూజతో ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు యాగానికి కావాల్సిన సామగ్రితో మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా రావడం ప్రత్యేకతను సంతరించుకుంది. యాగపూజలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో వేదమంత్రోచ్ఛారణ మిన్నంటింది. పూజల అనంతరం సుమారు వెయ్యిమంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తంజావూరు, తిరువణ్ణామలై నుంచి విచ్చేసిన పండితులు, యాగ నిర్వాహకులు సత్యనారాయణ, మోహన్, వేలాయుధం, రాజ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రథంపై ఏకాంబరేశ్వర స్వామి

యాదమరి(కాణిపాకం): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని యాదమ శ్రీఏకాంబరేశ్వర స్వామి ఆలయంలో శనివారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు స్వామి వారికి ఉదయం అభిషేక పూజలు జరిపించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథోత్సవంలో స్వామి వారిని ఆశీనులు చేసి ఊరేగించారు. అడుగడుగున భక్తులు కర్పూర హారతులు పట్టి స్వామిని దర్శించుకున్నారు.

ట్రాఫిక్ వలయంలో పచ్చికాపల్లం

- ఇరుకు రోడ్లతో రాకపోకలకు అంతరాయం
- వాహనచోదకుల అవస్థలు



పచ్చికాపల్లంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

వెదురుకుప్పం: వాహన రాకపోకలు రోజురోజుకీ పెరుగుతున్నా అధికారుల్లో మార్పు కన్పించడం లేదు. ఇరుకు రోడ్లతో నిత్యం ఎక్కడబడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. మండలంలోని పచ్చికాపల్లంలో ట్రాఫిక్ సమస్య జటిలంగా ఉంది. ఇక్కడకు తిరుపతి, పుత్తూరు, చిత్తూరు ప్రాంతాల వైపు నుంచి వచ్చే వాహనాల రాకపోకలు అధికంగా ఉండడంతో నిత్యం సమస్యలు తప్పడం లేదు. మూడు ప్రాంతాలకు వెళ్లాలంటే సుమారు 50 గ్రామాలకు చెందిన ప్రజలకు ఇక్కడకు రాకతప్పదు. దీంతో ట్రాఫిక్ కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. దీనికి తోడు రోడ్లపైనే ఆటోలను పార్కింగ్ చేస్తున్నారు. దుకాణాల వద్ద వాహనాలను ఉంచడంతో వ్యాపారాలకు అంతరాయం కలుగుతోంది. చిరు వ్యాపారస్తులు సైతం రోడ్లపైనే విక్రయాలు చేస్తుండడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. పైగా బస్టాండ్ లేదు. తిరుపతికి వెళ్లాలంటే పచ్చికాపల్లంలో రోడ్లపై నిలబడాల్సి వస్తోంది. ఆర్టీసీ బస్సులతో పాటు గ్రానైట్‌రాళ్లు తరలించే వాహనాలు, ప్రైవేటు వాహనాలు నిత్యం వస్తుంటాయి. వీటికి తోడు వందల సంఖ్యలో షేర్ ఆటోలు ఇబ్బడిముబ్బడిగా తిరుగుతున్నాయి. ఎక్కువ సంఖ్యలో వాహనాలు తిరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెదురుకుప్పం, పచ్చికాపల్లం, పాతగుంట ప్రాంతాలకు వెళ్లే ఆటోలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండడం మరింత ఇబ్బందికరంగా మారింది.

సంత రోజుల్లో జటిలం

మండలంలో అనేక చోట్ల రోడ్ల పైనే వారపు సంతలు జరుగుతున్నాయి. ప్రధానంగా చవటగుంట, పచ్చికాపల్లం ప్రాంతాలతోపాటు మొరవ, దేవళంపేట గ్రామాల్లో సంతలు నిర్వహిస్తున్నారు. చవటగుంటలో మంగళవారం, పచ్చికాపల్లంలో ఆదివారం సంత జరిగే సమయాల్లో రోడ్లపైనే వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో వాహనాలు వెళ్లేందుకు ఇక్కట్లు తప్పడం లేదు. ఏ సమయంలో ఏ వాహనం వెనక నుంచి వచ్చి ఢీకొడుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. పచ్చికాపల్లంలో మూడు రోడ్ల కూడలిలో ఏ మూల నుంచి ఏ వాహనం దూసుకుపోతుందో తెలియక స్థానికులు అవస్థలు పడుతున్నారు. పచ్చికాపల్లం మీదుగా హెవీ వాహనాలు(టిప్పర్లు) కంకర, డస్ట్‌తో వెళ్తుంటాయి. పెద్ద వాహనాలు వస్తే పక్కకు వైదొలగలేక పోతున్నారు. ట్రాఫిక్ సమస్య ఏర్పడి వాహనాలు నిలిచి పోతున్నాయి. కొన్ని సందర్భాల్లో అయితే 108 వాహనానికి కూడా దారి ఇవ్వక సతమతమవుతున్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. టిప్పర్లు హెవీ లోడ్లులతో తిరుగుతుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

బంగారుపాళెం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని జాస్మిన్‌కు శనివారం ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆర్థిక సాయాన్ని అందించారు. 9వ తరగతి చదువుతున్న జాస్మిన్ బాస్కెట్‌బాల్‌లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించింది. దీంతో ముస్లిం ఐక్య వేదిక ద్వారా రూ.10 వేలు నగదు అందజేసి సత్కరించింది. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జైనుల్, రాష్ట్ర అధికార ప్రతినిధి సాకత్, సమన్వయకర్త రషీద్, నియోజకవర్గ అధ్యక్షులు ఖాజా, గౌరవ అధ్యక్షులు రహీం, రిటైర్డు డీఈఓ అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.